క్లుప్తంగా

వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల సాగు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్

బేతంచెర్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 100 శాతం సబ్సిడీతో అర్హులైన చిన్న, సన్న కారు రైతులు పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ కిరణ్ కుమార్, హార్టికల్చర్ అధికారి రఘువరన్‌తో కలిసి ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడారు. ఏప్రిల్ 30వ తేదీలోగా గ్రామాల్లో పండ్ల తోటలు, పూల తోటలు, మునగ, ఆయిల్ పామ్ సాగుకు లబ్ధిదారులను గుర్తించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయ రాణి పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి ఇదే గ్రామనికి చెందిన పెద్ద మహాదేవుడు, వెంకటమ్మ మంగళవారం రూ.25,116 విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీపీ కుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యతో బంగారు భవిష్యత్తు



విద్యార్థులతో ఎంఈఓ, హెచ్‌ఎం

బేతంచెర్ల: విద్యతో బంగారు భవిష్యత్తు ఉంటుందని.. విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా బాగా చదువుకోవాలని ఎంఈఓ-2 అబ్రహం అన్నారు. మంగళవారం పట్టణంలోని హరిజనవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం పుల్లయ్య ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే సౌకర్యాలు, బోధన అంశాలు, మధ్యాహ్న భోజనంతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలకు అండగా ఉంటాం



చేనేత పరికరాలు పంపిణీ చేసిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె: చేనేత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఉండగా ఉంటుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నందివర్గం గ్రామంలో 75 మంది చేనేత కార్మికులకు రూ.28 లక్షల విలువైన చేనేత మగ్గాల పరికరాలను పంపిణీ చేశారు. బనగానపల్లె క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా తొలి విడతలో మంజూరైన వీటిని లబ్ధిదారులకు అందజేసినట్లు మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామక్రిష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

శిశువుకు తల్లి పాలే శ్రేయస్కరం



ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు

బనగానపల్లె రూరల్: పుట్టిన బిడ్డకు తప్పని సరిగా తల్లిపాలనే ఇవ్వాలని స్త్రీశిశుసంక్షేమశాఖ సూపర్‌వైజర్లు లక్ష్మీ శైలజ, జమీల, చిట్టెమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని పంచమపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డైట్, పెరటి తోటల పెంపకంపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు సునీత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చని ఉపాధి

- ఉపాధి కూలీలకు మూడు నెలలుగా అందని వేతనాలు
- ఆందోళనలో ఉపాధి కూలీలు.. తప్పని వలసలు
- నియోజకవర్గంలో 9,500 మంది కూలీలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

డోన్ రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు కష్టాలు తప్పడం లేదు. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేసినా పస్తులుండే పరిస్థితి నెలకొంది. ఇటు వలసలు వెళ్లలేక.. చేసిన పనులకు వేతనాలు రాక సతమతమవుతున్నారు. నెలల తరబడి పనులు చేయించుకుని వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కూలీలు ప్రశ్నిస్తున్నారు. అధికారులను ఎన్నిసార్లు అడిగినా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జమకాని వేతనాలు

12 వారాల నుంచి గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదన్నారు. గతంలో వారంలో నగదు జమయ్యేదని.. ఇప్పుడు మూడు నెలలైనా నగదు జమకాలేదని వాపోతున్నారు. కష్టపడినా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఉపాధి కూలీల వివరాలు

మండలం	కూలీలు
డోన్	2500
ప్యాపిలి	4500
బేతంచెర్ల	2500
మొత్తం	9500

ఆర్థిక ఇబ్బందులు

డోన్ నియోజకవర్గంలో 9,500 మంది కూలీలు ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరికి కూలి రూ.1.62 కోట్లు రావాల్సి ఉంది. ఈ ఏడాది ఉపాధి హామీ పనిని నమ్ముకుని వలసలు పోకుండా గ్రామాల్లోనే ఉంటున్న కూలీలకు ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. అసలే వేసవి కాలం.. ఒకవైపు వ్యవసాయ పనులు లేక.. మరోవైపు ఉపాధి పనులు చేసినా కూలి డబ్బులు రాక జీవనం కష్టతరంగా మారింది. అధికారులేమో వలసలు వెళ్లొద్దు.. స్థానికంగానే పనులు కల్పిస్తామని అంటారు.. వేతనాలు రాకుండా నెలల తరబడి కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కూలీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీని కన్నా వలసలు పోవడమే మంచిదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలి జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

త్వరలోనే జమ చేస్తాం



ఉపాధి కూలీల నిధులు మంజూరు కాకపోవడంతో 3 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఉన్నతాధికారులకు సమస్యను వివరించగా త్వరలోనే వస్తాయని చెబుతున్నారు. నిధులు రాగానే ఉపాధి కూలీలకు వేతనాలు మంజూరు చెస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. **-వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ, డోన్,**

12 వారాలుగా వేతనం అందలేదు



వ్యవసాయ పనుల్లేక ఉపాధి పనులను నమ్ముకుని కూలికి వెళ్లాం. 12 వారాలు పనులు చేసినా ఇప్పటి వరకు చిల్లి గవ్వ చేతికందలేదు. కుటుంబం పోషించుకోవడం కష్టంగా మారింది. అధికారులు ఎంతగా అడిగినా నిధులు రాలేదని చెబుతున్నారు. ఉపాధి పనులపై నమ్మకం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి కూలీలకు వేతనాలు చెల్లించాలి.

- రామాంజినేయులు, ఉడుములపాడు, డోన్

అధికారులు పట్టించుకోవాలి



కూలీలకు 12 వారాల నుంచి డబ్బులు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఆదాయం లేకుండా కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారు. ప్రభుత్వం ఉపాధి కూలీలపై చిన్నచూపు చూస్తోంది. వెంటనే నిధులు మంజూరు చేసి కూలీలు చెల్లించి ఆదుకోవాలి.

-ఓబులేష్, ఎంపీటీసీ సభ్యుడు, లక్ష్మంపల్లి

25న మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 25న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి మంగళవారం తెలిపారు. ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన జరిగే సమావేశంలో తాగునీటి సరఫరా, వ్యవసాయం, విద్య, వైద్యం తదితర అంశాలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని సూచించారు. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తాజా ప్రగతి నివేదికలతో సమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు.

26న సంజామలలో..

సంజామల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 26న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పోచ రమాదేవి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

134 మందికి కంటి పరీక్షలు

బేతంచెర్ల: మండల పరిధిలోని రంగాపురం గ్రామ సచివాలయంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్‌రెడ్డి సూచన మేరకు కర్నూలు సుశీల నేత్రాలయ ఆస్పత్రి వైద్యులు మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ చంద్రశేఖర్ 134 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఇందులో 39 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి రెఫర్ చేశారు.

వృద్ధ ఖైదీలపై ప్రత్యేక దృష్టి

డోన్ టౌన్: రిమాండ్ ఖైదీల్లో వయో వృద్ధులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా లీగల్ సర్వీసు ఆథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలు, వసతులు, భోజనశాలను తనిఖీ చేసి ఖైదీలతో సమావేశమయ్యారు. వయస్సు, నేర చరిత్ర, బెయిల్ స్థితిగతులపై ఆరా తీశారు. వయో వృద్ధుల కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారు లీగల్ సర్వీసు ఆథారిటీ ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని తెలిపారు. డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతి, సబ్ జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, న్యాయవాది మాధవ స్వామి ఉన్నారు.



ఖైదీలతో సమావేశమైన న్యాయమూర్తులు

శక్తి యాప్‌తో పోలీసు రక్షణ



యాప్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

డోన్ టౌన్: శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో తక్షణ పోలీసు సహాయం పొందవచ్చని ఎస్‌ఐ మమత, డోన్ శక్తి టీం సభ్యులు అన్నారు. మంగళవారం డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళలు, పిల్లల భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, బాల్య వివాహాలు, పోలీసు ఎమర్జెన్సీ 100,112,181 గురించి వివరించారు. కొందరికి శక్తియాప్ డౌన్ లోడ్ చేయించారు. ఆకతాయిలు ఎవరైనా మహిళలను ఇబ్బంది పెడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

వాహనదారులకు జరిమానా

ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని పట్టణ ఏఎస్‌ఐ నాగరాజు అన్నారు. పాతబస్టాండ్, రైల్వేస్టేషన్ రోడ్డులో వాహనాల తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు.

నాటుసారా స్వాధీనం

డోన్ రూరల్: నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. జిల్లా అధికారుల సూచన మేరకు ప్యాపిలి మండలం అలేబాద్‌తండా గ్రామంలో దాడులు నిర్వహించామని తెలిపారు. దాడుల్లో సారా తయారు చేస్తున్న కాట్రావత్ రమేష్‌నాయక్‌ను అరెస్టు చేశామన్నారు. నిందితుడి నుంచి 240 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో 600 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. నాటు సారా తయారు చేసినా.. విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్స్ నాగరాజు, సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ గోపాల్‌సింగ్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.



పట్టుపడిన నాటుసారాను చూపుతున్న సీఐ వరలక్ష్మి

హాస్టల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై అసంపూర్తిగా ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ హాస్టల్ భవనాన్ని పూర్తి చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రతాప్, సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థి నాయకులతో కలిసి భవనాన్ని సందర్శించారు. ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయని.. త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. లేకుంటే మంత్రి ఇంటిని ముట్టడిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

డోన్ రూరల్: మండల పరిధిలోని అబ్బిరెడ్డిపల్లె చెరువు వద్ద మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పి కిందపడడంతో వికాస్, రాకేష్, ఇర్ఫాన్ అనే ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో వికాస్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుండెపోటుతో వ్యక్తి మృతి



మృతి చెందిన నాగన్న

డోన్ టౌన్: పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ ఎదురుగా ఉన్న సులభ్ కాంప్లెక్స్ వాషింగ్ రూమ్‌లో వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. బంధువులు, గ్రామస్తుల వివరాల మేరకు.. ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన గార్లదిన్నె నాగన్న (62), భార్య సీర్నమ్మ అలియాస్ శ్రీనివాసలమ్మ గుమ్మకొండలో నివాసం ఉంటూ కొద్ది నెలలుగా రైల్వేకోడూరు సమీపంలోని పండ్ల తోటల్లో పని చేస్తున్నారు. మంగళవారం రైల్వేకొడూరు నుంచి గుమ్మకొండకు వెళ్లే క్రమంలో డోన్‌లో వాష్‌రూంకు వెళ్లి గుండెపోటుకు గురయ్యాడు. నిర్వాహకులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు కుటుంబ సభ్యులకు తెలియజేసి స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పరుగు పందెంలో వెండి పతకం



బాలుడిని అభినందిస్తున్న హెచ్‌ఎం

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ పాఠశాలకు చెందిన ఎల్‌కేజీ విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం గీతా తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ చెన్నైలోని రాజారతినం స్టేడియంలో లిటిల్ చాంపియన్‌షిప్ కిడ్స్ రన్ పోటీలు జరిగాయన్నారు. పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న విశ్వక్ రామ్ 100 మీటర్ల పరుగు పందెంలో వెండిపతకం కైవసం చేసుకున్నాడని చెప్పారు. బాలుడిని హెచ్‌ఎంతోపాటు ఫిజికల్ డైరెక్టర్లు హర్ష, ఓబులేసు, ఉపాధ్యాయులు అభినందించారు.

అల్లా బకాష్ వలీ ఉరుసు ప్రారంభం



విద్యుత్ దీపాలంకరణలో దర్గా

బేతంచెర్ల: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో వెలసిన అల్లా బకాష్ వలీ ఉరుసు మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైంది. దర్గాను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. రాత్రి గంథోత్సవం జరిగింది. బుధవారం ఉరుసుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు లింగమూర్తి, ఖాజ హుస్సేన్ తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో పోస్టర్ల తొలగింపు

కొలిమిగుండ్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఇష్టారాజ్యంగా అతికించిన వివిధ రకాల పోస్టర్లను ఎట్టకేలకు తొలగించారు. బస్టాండ్ పబ్లిసిటీ వేదికగా మారుతుందనే వైనంపై సాక్షి దినపత్రికలో 'ఆర్టీసీ ప్రాంగణం..ప్రచారానికి కేంద్రం' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి బనగానపల్లె ఆర్టీసీ డిపో అధికారులు స్పందించారు. మంగళవారం ఆర్టీసీ సిబ్బంది కొలిమిగుండ్లకు చేరుకుని బస్టాండ్ లోపల, వెలుపల అతికించిన పోస్టర్లను తొలగించి శుభ్రం చేయించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



బస్టాండ్ లోపల భాగంలో పోస్టర్లు తొలగించి శుభ్రం చేస్తున్న దృశ్యం

ఉద్యాన పంటలు ఉత్తమం



సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

అవుకు: మండల పరిధిలోని రైతులకు ఉద్యాన పంటల సాగు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయేతర, ఉద్యాన, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్న కారు రైతులను గుర్తించాలన్నారు. వారికి వందశాతం సబ్సిడీతో పండ్ల తోటలకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా 17 రకాల పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చని చెప్పారు. పంట కాలంలో అంతర పంటలు కూడా సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు అబ్దుల్ హక్, రఘువరణ్, ఏపీఓ ప్రకాశ్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ నాగార్జున పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు.. సమాజ మార్గదర్శకులు

బనగానపల్లె రూరల్: ఉపాధ్యాయులు.. సమాజ మార్గదర్శకులని నంద్యాల డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాలి బాలగంగాధర్‌రెడ్డి ముందస్తు పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లుగా పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచడంతో పాటు అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం బాలగంగాధర్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. నంద్యాల, మహానంది, దొర్నిపాడు, అవుకు, బనగానపల్లె ఎంఈఓలు బ్రహ్మంనాయక్, రామసుబ్బయ్య, మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, స్వరూప, శ్రీనివాసులు పాల్గొన్నారు.



హెచ్‌ఎం గాలి బాలగంగాధర్ రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మొక్కలతోనే మానవ మనుగడ



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

డోన్ టౌన్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం ధరిత్రీ దినోత్సవం సందర్భంగా పాతపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో మొక్కలు నాటించి ప్రతిజ్ఞ చేయించారు. విశ్వంలో 70 శాతం నీరు, 30శాతం భూమి ఉందని.. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వల్ల వాతావరణం కలుషితమై ఓజోన్ పొర ప్రమాదకరంగా మారిందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



స్టాల్‌ను పరిశీలిస్తున్న సీడీపీఓ

అవుకు: మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం చాలా అవసరమని సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం అవుకు ఎంపీడీఓ కార్యాలయ భవనంలో చిరు ధాన్యాలు, స్థానిక ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను అవుకు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ అభినయ్‌తో కలిసి పరిశీలించారు. అక్కడ చేసిన వంటలను రుచి చూశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనతను అధిగమించాలంటే క్రమం తప్పకుండా ఆకుకూరలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్డు తీసుకోవాలని సూచించారు. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు పావని, శివమ్మ పాల్గొన్నారు.

కనిపించని కాడెద్దులు..!

- వ్యవసాయంలో యంత్ర పరికరాల వినియోగం
- భారంగా మారుతున్న పెట్టుబడులు



ఎద్దులతో పొలం దున్నుతున్న రైతన్న

ప్యాపిలి: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతన్న కూడా మారక తప్పడం లేదు. వ్యవసాయంలో యంత్ర పరికరాల వినియోగం పెరుగుతుండడంతో క్రమంగా కాడెద్దులు కనిపించకుండా పోతున్నాయి. యంత్ర పరికాల వినియోగంతో తక్కువ సమయంలో ఎక్కువ పని జరుగుతుంది. అదే కాడెద్దులతో పని చేస్తుంటే ఎక్కువ సమయం అయినప్పటికీ అందులో ఉన్న సంతృప్తి యంత్ర పరికారల్లో రాదని రైతులు అంటున్నారు. గతంలో పొలం దుక్కి దున్నాలన్నా, పంట సాగు చేయాలన్నా కాడెద్దులతోనే చేసేవారు. ప్రస్తుతం గ్రామీణులు అన్ని పనులకూ ట్రాక్టర్లు, ఇతర యంత్రాలనే వాడుతున్నారు. కౌలు రైతులు సైతం యంత్ర పరికరాలతోనే వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. కాడెద్దులు ఉంటే గతంలో చేతి నిండా పని, చేతిలో డబ్బులు ఉండేవి. ఇప్పుడు పనిలేక, ఎద్దులను పోషించలేక పలువురు రైతులు వాటిని విక్రయిస్తున్నారు.



ట్రాక్టర్‌తో సేద్యం

అన్ని పనులకు ఆధునిక పరికాలే..

పల్లె సీమల్లో గతంలో తెల్లవారగానే రైతులు కాడెద్దులతో పొలాలకు చేరుకునేవారు. ప్రతి రోజూ నాగలిపట్టి కాడెద్దులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాన్ని దున్నుకునేవారు. అయినా రైతులకు ఏమాత్రం కష్టం అనిపించేది కాదు. ప్రస్తుతం ట్రాక్టర్లతో కొద్ది గంటల్లోనే పొలాలను దున్నేస్తున్నారు. అలాగే గతంలో రైతులు పండించిన పంట ఉత్పత్తులు ఇంటికి చేర్చాలంటే ఎంతో వ్యయప్రయాసలు పడేవారు. రోజుల తరబడి ఇదే పనిలో రైతులు నిమగ్నమయ్యేవారు. ప్రస్తుతం ట్రాక్టర్ల ద్వారా గంటల వ్యవధిలోనే అని పనులు చేసుకుంటున్నారు.

నిరుపయోగంగా సబ్ జైల్



బనగానపల్లె సబ్ జైల్

బనగానపల్లె: నిబంధనలకు అనుగుణంగా సరైన వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో 65 ఏళ్ల నాటి బనగానపల్లె సబ్ జైల్ మూడున్నరేళ్లుగా నిరుపయోగంగా మారింది. ఇక్కడ ఉంచాల్సిన రిమాండ్ ఖైదీలను ఆళ్లగడ్డ సబ్ జైల్‌లో ఉంచుతున్నారు. బనగానపల్లె సబ్‌జైల్‌లో రిమాండ్ ఖైదీల కోసం మొత్తం ఆరు గదులు ఉండగా ఐదు మగవారికి ఒక గది స్త్రీలకు ఏర్పాటు చేశారు. ఈ గదుల్లో మొత్తం 30 మంది రిమాండ్ ఖైదీలు ఉండే అవకాశం ఉంది. 1959లో ఇక్కడ సబ్ జైల్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అభివృద్ధికి నోచుకోలేదు. పతనావస్థలో ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడ సబ్ జైల్‌ను నిర్వహిస్తున్నారు. వర్షకాలంలో గదుల్లో నీరు కారుతుందని గతంలో ఈ గదుల్లో ఉన్న రిమాండ్ ఖైదీలు పేర్కొంటున్నారు.

నిబంధనలు ఇలా..

జైళ్లశాఖ నిబంధనల మేరకు సబ్‌జైల్ కాంపౌండ్ వాల్ 15 అడుగులు ఉండాలి. ఆ పైభాగంలో మూడు అడుగుల మేర వైరింగ్ ఫెన్సింగ్ ఉండాలి. చుట్టూ నివాస గృహాలు ఉన్నా పైఅంతస్తులు ఉండకూడదు. బనగానపల్లె సబ్‌జైల్ చుట్టూ కాంపౌండ్‌వాల్ పది అడుగులు మాత్రమే ఉంది. పక్కనే పై అంతస్తు నివాస గృహాలు ఉన్నాయి. బనగానపల్లె పోలీస్ సర్కిల్ పరిధిలోని బనగానపల్లె, నందివర్గం, అవుకు పోలీస్‌స్టేషన్లకు చెందిన రిమాండ్ ఖైదీలను ఈ సబ్ జైల్‌లో ఉంచేవారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సమీపంలోనే ఉన్నందున రిమాండ్ ఖైదీలను తీసుకెళ్లడంలో ఇబ్బంది ఉండేది కాదు. అయితే మూడున్నరేళ్లుగా ఆళ్లగడ్డ సబ్‌జైల్‌కు తీసుకెళుతుండడంతో ఇబ్బందిగా మారింది.

అభివృద్ధికి దూరం

2021 ఆగస్టు 2న బనగానపల్లె సబ్‌జైల్ ఆధ్వర్యంలో సబ్‌జైల్ పక్కనే హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సబ్‌జైల్ నిర్మాణ పనులను కొంతమేర మార్పు చేయాల్సి వచ్చింది. ఇందులో నెలకొన్న సాంకేతిక ఆవరోధాల వల్ల అప్పటి నుంచి సబ్‌జైల్ నిరుపయోగంగా మారింది. రిమాండ్ ఖైదీలను ఉంచడంలేదు. అభివృద్ధి కోసం పంపిన ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు.

చర్యలు తీసుకుంటాం



గతంలో ఇక్కడ 30 మంది రిమాండ్ ఖైదీలు ఉండేవారు. సబ్‌జైల్ ఆధ్వర్యంలో మూడున్నరేళ్ల క్రితం పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసిన తరువాత కొంత మేర నిర్మాణంలో మార్పులు జరిగాయి. దీంతో సాంకేతిక ఆవరోధల వల్ల సబ్‌జైల్ నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం రిమాండ్ ఖైదీలను ఉంచడంలేదు. సబ్‌జైల్‌లో వసతుల కల్పనకు ఉన్నతాధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు.

-ఎం.యోగేష్‌కుమార్, సబ్‌జైలర్, బనగానపల్లె